క్లుప్తంగా

పాటెమ్మ తల్లి ఆలయ చైర్మన్‌గా శ్రీనివాసరావు


యలమర్తి శ్రీనివాసరావు

దెందులూరు: చల్లచింతలపూడిలోని పాటెమ్మ తల్లి ఆలయ చైర్మన్‌గా యలమర్తి శ్రీనివాసరావు ఆదివారం నియమితులయ్యారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా సంతాన లక్ష్మిగా యలమర్తి వారి ఆడపడుచుగా ఇలువేల్పుగా పేరొందిన చల్లచింతలపూడి, పెరుగ్గూడెం గ్రామాలమధ్య ఉన్న గ్రామదేవత పాటెమ్మతల్లి ఆలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలు అందిస్తానని, ఏటా ఉత్సవాలు వైభవంగా, సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని ఆయన అన్నారు.

అనుమతులు లేకుండా చెరువు తవ్వకం


గండివారిగూడెంలో అనుమతి లేకుండా తవ్విన చెరువు


దెందులూరు: మండలంలోని ముప్పవరం గ్రామ పంచాయతీ గండివారిగూడెంలో ఆర్ ఎస్ నంబర్ 19/2 బీ 90 సెంట్ల వ్యవసాయ వరి పంట సాగు భూమిని రెవెన్యూ, ఫిషరీస్ శాఖల అనుమతులు లేకుండా అర్ధరాత్రి చెరువు తవ్వారని మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళి అన్నారు. ఆదివారం గండివారిగూడెంలో ఆయన మాట్లాడుతూ అధికారుల నుంచి ఎటువంటి అనుమతి లేకుండా చేపల చెరువు తవ్విన సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ డైరెక్టర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మురళీకృష్ణ అన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు ముమ్మరంగా ఏర్పాట్లు


కళాశాలలో క్రికెట్ పోటీలకు గ్రౌండ్ ముస్తాబు

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండల వేగవరంలోని హేలాపురి ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు గ్రౌండ్ ముస్తాబైంది. ప్రకాశం, గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి 70 టీంల క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారని కళాశాల ఏఓ టీ.కరుణానిధి, మేనేజింగ్ ట్రస్టీ సమీర్, ప్రిన్సిపల్ ఎం.రాధాకృష్ణ అన్నారు. ఆదివారం జేసీబీ, రోలర్లతో గ్రౌండ్‌ను చదును చేసి తడిపారు. ఇప్పటి వరకు 40 టీంలు రిజిస్ట్రేషన్ చేయించాయని, కళాశాల వైస్ చైర్మన్ ఆరసవిల్లి అరవింద్, సౌత్ సెంట్రల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని వివరించారు.

భీమడోలు చక్కెర కర్మాగారం మాజీ చైర్మన్ మృతి


సుంకవల్లి ప్రసాదరావు

ఉంగుటూరు(గణపవరం): ప్రముఖ రైతు నాయకుడు సుంకవల్లి ప్రసాద్ (87) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉంగుటూరు మండలం నాచుగుంట సర్పంచ్‌గా పనిచేసిన ఆయన నాచుగుంట ప్రసాద్‌గా గుర్తింపు పొందారు. 1978లో ఉంగుటూరు నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. అనంతరం ఇందిరా కాంగ్రెస్‌లో చేరి పలు పదవులు నిర్వహించారు. భీమడోలు చక్కెర కర్మాగారం చైర్మన్‌గా పనిచేశారు. ప్రసాదరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పారిశ్రామిక వేత్త, ఛాగల్లు సుగర్స్ అధినేత రాజేశ్వరిరామ కృష్ణ ఈయనకు వియ్యపురాలు. ప్రసాదరావు మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

వర్గ విభేదాలకు దూరం

ఏలూరు రూరల్: మండలంలోని కొల్లేరు గ్రామం ప్రత్తికోళ్లలంక ప్రజలు ఒక్కటయ్యారు. 10 ఏళ్ల వర్గభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టి, కలిసి మెలిసి జీవించాలని నిర్ణయించారు. కట్టుబాట్ల ప్రకారం బంటాలుగా చేపలు సాగుతో ముందుకు సాగాలని భావిస్తున్నారు. శనివారం సర్పంచ్ ఘంటసాల మహాలక్ష్మిరాజు, వైస్ ఎంపీపీ బలే సత్యప్రసాద్‌తో పాటు రెండువర్గాల పెద్దలు స్థానిక ప్రజాప్రతినిధి కొఠారు రామచంద్రరావును కలిశారు. ఊరంతా ఒక్కటయ్యామని, గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. 2013లో గ్రామంలో ఘర్షణలు తలెత్తాయి. ఎన్నికల సమయంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని పెట్టిన చిచ్చు కారణంగా 5 వేల మంది గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడంతో వర్గభేదాలు లేకుండా ఇరు వర్గాల ప్రజలకు అధికారులు సంక్షేమ పథకాలు అమలు చేసి, గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టారు. ఫలితంగా పెద్దలు, ప్రజలు విభేదాలు మరిచారు. స్థానిక రామాలయం, కొల్లేరు మల్లన్న దేవాలయాల్లో నిత్యపూజలు జరపాలని నిర్ణయించారు.

జగనన్న గోరుముద్దలో.. మరో పోషకాహారం

- భోజన పథకం మెనూలో బెల్లం కలిపిన రాగి జావ
- వారానికి మూడు రోజులు పంపిణీ
- రేపటి నుంచి అన్ని సర్కారు పాఠశాలల్లో అమలు


రాగి జావ తీసుకుంటున్న కొమ్మర యూపీ విద్యార్థినులు (ఫైల్)


పాఠశాలలోని రాగి, బెల్లం పిండి ప్యాకెట్లు

నిడమర్రు: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో మరో పోషకారహారం చేరింది. పాఠశాల్లోని పిల్లలకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు జగన్ సర్కారు మధ్యాహ్న భోజన పథకం మెనూలో ఇప్పటికే సమూల మార్పులు చేసి వారంలో 5 రోజులు కోడిగుడ్డుతోపాటు ప్రతి రోజు పోషక విలువలతో కూడిన వివిధ రకాల వంటలు వండి విద్యార్థులకు వడ్డించేలా చర్యలు తీసుకుంది. తాజాగా ఉదయం పూట పాఠశాలలకు హాజరయ్యే విద్యార్థులకు వారానికి మూడు రోజుల పాటు అల్పాహారంగా గ్లాసు రాగి,బెల్లం మిశ్రమ జావ అందించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే రాగి, బెల్లం పిండి ప్యాకెట్లు పాఠశాలలకు సరఫరా చేసారు. ఈ రాగి జావను పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో వండి వడ్డించనున్నారు. రాగి జావ తయారీపై ఇప్పటికే ఎండీవో ఏజెన్సీ నిర్వాహకులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తగిన సూచనలు అందించారు. పాఠశాలకు రాగానే ఉదయం రాగి,బెల్లం మిశ్రమం జావ అందించడంపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

21 నుంచి ఈ పథకానికి శ్రీకారం

ప్రభుత్వ విద్యార్థులకు బెల్లం కలిపిన రాగి జావను ఈనెల 10న అందించాలని అధికారులు ఏర్పాట్లు చేసారు. కానీ బెల్లం, రాగి పిండి పంపిణీ ఆలస్యం అవడంతోపాటు, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడింది. దీన్ని ఈనెల 21న మంగళవారం నుంచి అన్ని సర్కారు స్కూళ్లలో రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. వారానికి మూడు రోజులపాటు ప్రతి మంగళ, గురు, శని వారాల్లో ఈ రాగి జావను విద్యార్థులకు వడ్డించనున్నారు. రాగి జావ తాగేందుకు ఆయా స్కూళ్లలోని విద్యార్థుల రోలు ప్రకారం స్టీలు గ్లాసులు సైతం ప్రభుత్వం సరఫరా చెయ్యనుంది. స్టీలు గ్లాసులను అందించేందుకు మరో పది రోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. దీంతో మంగళవారం విద్యార్థులంతా ఇంటి వద్ద నుంచి స్టీలు గ్లాసులు తెచ్చుకునేలా సంబంధిత హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులు ఆదివారం సూచనలు జారీ చేసారు.

నియోజకవర్గంలో 26 వేల మందికి

ఉంగుటూరు నియోజకవర్గంలో 215 ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 26వేల మంది వరకూ చదువుతున్నారు. వీరందరూ రాగి జావ పథకంలో ప్రయోజనం పొందనున్నారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లం పిండి మిశ్రమంతో తయారు చేసిన జావను అందించనున్నారు. చిక్కీ లేని రోజుల్లో పాఠశాల తెరిచే సమయానికి ముందే ఎండీఎం ఏజెన్సీ వారు ఈ రాగి జావ తయారు చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జగనన్న గోరుముద్ద పథకాన్ని ఉన్నత అధికారులు ఐఎంఎంఎస్ యాప్ ద్వారా నిరంతరం పరిశీలిస్తున్నారు. అదే యాప్ ద్వారా ఈ రాగిజావ ఏ సమయానికి తయారు చేసారు, ఎంత మంది జావ తాగారు అనే విషయాన్ని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో హెచ్‌ఎంలు నమోదు చేసేలా ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ పథకం అమల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా 14417 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు చెయ్యవచ్చు.

పాఠశాలల్లో బెల్లం, రాగి పిండి సిద్ధం



అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకు సరిపడా బెల్లం, రాగి పిండి 5కిలోల ప్యాకెట్ల రూపంలో సిద్ధం చేసాం. ఈ నెల 21 నుంచి అన్ని పాఠశాలల్లో ఎండీవో నిర్వాహకులతో ఉదయం పూట రాగి, బెల్లం మిశ్రమ జావ వడ్డించేలా ఏర్పాట్లు పూర్తి చేసాం. జావ తయారీపై వీడియో రూపంలో ప్రదర్శించి నిర్వాహకులకు తగిన శిక్షణ అందించాం.

– పుచ్చల శేషు, ఎంఈవో, నిడమర్రు

పేద విద్యార్థులకు పోషకాహారం



ప్రభుత్వ పాఠశాలల్లోని 80 శాతం మంది పేద విద్యార్థులే ఉంటారు. వీరిలో ఏ విద్యార్థి ఆకలితో పాఠశాలకు రాకూడదనే ముఖ్యమంత్రి జగన్ ఆలోచన. పౌష్టికాహార లోపంతో పిల్లల్లో ఎదుగుదల తగ్గడమే కాకుండా రక్తహీనత పెరుగుతున్న నేపథ్యంలో బెల్లం కలిపిన రాగి జావ అల్పాహారంగా అందించడం వల్ల విద్యార్థుల్లో ఐరన్, కాల్షియం లోపాలు నివారించవచ్చు.

– పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్యే, ఉంగుటూరు

రాగి జావ పంపిణీ హర్షణీయం



పాఠశాలకు వచ్చిన వెంటనే అల్పాహారంగా బెల్లం కలిపిన రాగి జావ పంపిణీ నిర్ణయం హర్షనీయం. జగనన్న గోరుముద్దలో ఇప్పటికే సోమ, బుధ, శుక్రవారాల్లో బెల్లం, వేరుశెనగ చిక్కీ అందిస్తున్నారు. తాజాగా మిగిలిన మూడురోజుల్లో రాగిజావ వడ్డించంతో మా అందరికీ స్కూల్లో పౌష్టికాహారం అందుతుంది. ఇంటి వద్ద టిఫిన్ ఆలస్యమైనా బెంగలేదు. స్కూల్లో రాగి జావ ఉంటుంది.

– తోపు యేసులక్ష్మి, 7వ తరగతి, బువ్వనపల్లి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసిన 2003 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

పెదపాడు: పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికకు పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. 2003లో పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల క్రితం అందరూ కలిసి 10వ తరగతి వరకూ చదువుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. దీంతో వారి ఆనందానికి అవధుల్లేవు. పాఠశాలలో తామంతా కలిసి ఆనాడు చేసిన చిలిపి చేష్టలు, హోమ్ వర్క్ చేయకపోతే ఉపాధ్యాయులు పెట్టిన చీవాట్లు, కొట్టిన దెబ్బలు, మైదానంలో ఆటలాడేటప్పుడు తగిలిన దెబ్బలు, తోటి విద్యార్థులు నిక్ నేమ్‌లతో పిలుచుకున్న ఆనాటి మధుర స్మృతులను వారంతా నెమరు వేసుకున్నారు. తోటి విద్యార్థులంతా ఒకచోటకు చేరుతున్నామనే ఆనందంతో ఉదయం 9గంటలకే పాఠశాలకు చేరుకున్న వారంతా ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. ఎవరెవరు ఎక్కడ ఏం చేస్తున్నారు, పిల్లలు ఏం చేస్తున్నారంటూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఇంజనీర్లుగా, వ్యాపారవేత్తలుగా, ఉపాధ్యాయులుగా వివిధ వృత్తులలో స్థిరపడినా మేమంతా మీ విద్యార్థులమేనంటూ గురువుల నుంచి ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మరింత ఉన్నత స్థాయికి చేరుకుని మంచి పేరు సంపాదించాలని కోరారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలతోను, దుశ్శాలువాలతో వారంతా ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనం చేసారు. ఉపాధ్యాయులు దండమూడి నాగేశ్వర రావు, గారపాటి భాస్కరరావు, అహ్మద్‌ఆలీ, ప్రసాదరావు, దేవ్, లక్ష్మీ, రాధాకృష్ణ పాల్గొన్నారు.

మారిన వాతావరణం.. ఆక్వా రైతుల్లో గుబులు


చెరువులలో తిరుగుతున్న ఏరియేటర్లు

గణపవరం: ప్రస్తుత వాతావరణం ఆక్వా రైతుల్లో గుబులు పుట్టిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా మూడు రోజులుగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. విపరీతమైన చలి, వర్షాలతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. దీనితో ఆక్వా రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ తరహా వాతావరణంలో చేపలు, రొయ్యలకు ఆక్సిజన్ సమస్య తలెత్తుతుంది. సరిపడ ఆక్సిజన్ అందక రొయ్యలు నీటిపై తేలియాడుతున్నాయి. దీనితో రైతులు చెరువుల్లో నిరంతరం ఏరియేటర్లు తిప్పుతూ, నీటిని ఇంజన్లతో రీసైక్లింగ్ చేస్తున్నారు. ఆక్సిజన్ లోటు పూడ్చడానికి రసాయనాలు, మందులు వినియోగిస్తున్నారు. మూడు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఆదివారం వాతావరణ పూర్తిగా చల్లగా ఉండి, వర్షం జల్లులు పడ్డాయి. రోజంతా మబ్బులు కమ్మడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఆక్వా సాగు రైతులను దారుణంగా దెబ్బతీసింది. నాణ్యతలేని సీడ్, వైరస్ తెగుళ్ల విజృంభణ, ధరల పతనం, మేతలు, మందుల ధరలు పెరిగిపోవడం వంటి కారణాలతో 90 శాతం రైతులు పెట్టుబడులు కోల్పోయారు. ఇప్పుడిప్పుడే సాగు గాడిన పడుతుందని రైతులు ఆశగా సాగు కొనసాగిస్తున్న తరుణంలో అల్పపీడన ప్రభావం ఏమేరకు ఉంటుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో సుమారు 25వేల ఎకరాల విస్తీర్ణంలో ఆక్వా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం 15వేల ఎకరాల్లో చెరువులలో రొయ్య, చేప సీడ్ ఉంది.

యంత్ర సేవా పథకం.. సాగుకు ప్రభుత్వ సాయం

- రైతులకు ట్రాక్టర్ల పంపిణీ
- ఆధునిక వ్యవసాయ పరికరాల అందజేత
- ఐదుగురు సభ్యులున్న గ్రూపులకు మంజూరు


పెదపాడు మండలంలోని తోటగూడెంలో యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు అందించిన ట్రాక్టరు

మండలం	ట్రాక్టర్ల సంఖ్య	ట్రాక్టర్ల మొత్తం విలువ రూ.	రాయితీ రూ.
ఏలూరు	5	37,33,913	14,93,564
దెందులూరు	7	52,89,223	21,15,694
పెదవేగి	9	75,17,059	26,60,752
పెదపాడు	11	77,90,710	29,50,058

పెదపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలు అందించడంలో రైతులకు పెద్దపీట వేస్తోంది. ఈ నాలుగేళ్లలో రైతన్నలకు తోడుగా వారిని ఆదుకునే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ పథకాల అమలులో విప్లవాత్మకం మార్పులు తీసుకువస్తోంది. రైతు భరోసా ద్వారా మూడు విడతలుగా ఏటా రూ.13,500 అందించడం, రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉదయం పూట 9గంటలు అందించడం, ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచడం, ఉచిత బీమా పథకం వంటి పథకాలతో పాటు వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ఐదుగురు రైతులు కలిసి గ్రూప్‌గా ఏర్పడితే వారికి రూ. 15లక్షల వరకు యంత్ర పరికరాలను అందిస్తోంది. ట్రాక్టరుతో పాటు ఇతర పరికరాలను అందిస్తోంది. రూ.15 లక్షలలో 40 శాతం రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. 10 శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లిస్తే మిగిలిన 50 శాతం బ్యాంకు రుణంగా ప్రభుత్వం అందిస్తోంది. ఈవిధంగా రైతులు తమ గ్రూపు ద్వారా యంత్రాలు తీసుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వ్యవసాయాభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి రైతులకు సకాలంలో అందించేలా చర్యలు చేపడుతున్నారు. దీంతో రైతుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు వ్యవసాయ పనిముట్లు



ప్రభుత్వం రైతులకు ట్రాక్టర్లు వ్యవసాయ పనిముట్లు అందిస్తోంది. ఐదుగురు గ్రూపుగా ఏర్పడితే ట్రాక్టరుతోపాటు కల్టివేటర్లు, పడ్లర్లు, సూర్పిడి యంత్రాలు అందిస్తోంది. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ఏడాది అర్హులైన రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందిస్తాం.

– వై సుబ్బారావు, అసిస్టెంట్ డైరక్టరు, వ్యవసాయ శాఖ ఏలూరు డివిజన్

ట్రాక్టర్లు అందించడం మంచి పరిణామం



ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా ట్రాక్టర్లు రైతులకు అందిస్తోంది. గ్రామాల్లో రైతులకు వ్యవసాయానికి అనువుగా ట్రాక్టర్లతోపాటు ఇతర పరికరాలు అందించడం మంచి పరిణామం. దీనివల్ల పంటల సాగుకు వ్యవప్రయాసలు తగ్గుతున్నాయి. పథకాలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– కె వెంకట సుబ్బయ్య, రైతు, పునుకొల్లు

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


భీమడోలులోని పాఠశాలలో చిన్నారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రిన్సిపల్ ఫాదర్ రాజు

భీమడోలు: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ ఫాదర్ రాజు అన్నారు. భీమడోలులోని ఎం.నాగులపల్లికి చెందిన ఓ ప్రైవేటు పాఠశాలలో ఆదివారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా జరిగింది. 9వ తరగతి విద్యార్థులు ఈ ఏడాది పదో పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గురువులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాలలో 85 మంది విద్యార్థినీ విద్యార్థులతో గ్రూప్ ఫోటోలు దిగారు. వారికి ప్రతిభా సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ జోషి, ఫాదర్ జోబి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత


మద్యం సీసాలతో నిందితుడు

ఉంగుటూరు(గణపవరం): మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తూ, గ్రామాల్లో అధిక రేట్లకు విక్రయిస్తున్న ఒక వ్యక్తిని చేబ్రోలు పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. రావులపర్రుకి చెందిన కోన సత్యనారాయణ మద్యం దుకాణాలలో మద్యం సీసాలు కొనుగోలుచేసి బ్లాకులో అధిక రేట్లకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై స్వామి చేబ్రోలు రైల్వే గేటువద్ద కాపుకాసి మద్యం సీసాలతో గొల్లగూడెం వైపు వెళ్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి తాడేపల్లిగూడెం కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం మత్తులో వేడినూనె తాగి వ్యక్తి మృతి

గణపవరం: మద్యం మత్తులో ఒక యువకుడు వేడివేడి నూనె తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు చేబ్రోలు ఎస్సై స్వామి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం చేబ్రోలులో ఈనెల 4న ఇందిరా కాలనీకి చెందిన కొత్తూరు సత్తిబాబు (35) మద్యం తాగి ఇంటికి వచ్చి మంచినీళ్లు అనుకుని అప్పుడే వంటకాలు చేసి మిగిలిన వేడి నూనెను గ్లాసులో పోసి ఉంచగా అవి మంచినీళ్లు అనుకుని తాగేశాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు సత్తిబాబును ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సత్తిబాబు మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వామి తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


1 కేఎం రన్‌లో పాల్గొన్న మహిళలు

ఏలూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎఎస్ఆర్ స్టేడియం మహిళ వాకర్స్ ప్రెసిడెంట్ టి.మేరీమాణిక్యం అన్నారు. ప్రపంచ మహిళ దినోత్సవం నేపథ్యంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆదివారం ఏలూరు సాయ్ ట్రైనింగ్ సెంటర్ మహిళలకు పోటీలు నిర్వహించింది. స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో చేపట్టిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్ విభాగాల్లో సత్తా చాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవానికి రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి బడేటి వెంకట్రామయ్య విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం మహిళలు విద్య, ఉద్యోగ రంగాల్లో రాణించడంతో దేశం అభివృద్ధి బాట పట్టిందన్నారు. కొన్నేళ్లుగా వ్యాపార, క్రీడ రంగాల్లో సైతం రాణిస్తుండడం సంతోషం కలిగిస్తుందన్నారు. కుటుంబాన్ని నడిపించే మహిళ అన్ని రంగాల్లో రాణిస్తే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ మహిళలను ప్రోత్సహించాలని సూచించారు. సాయ్ సెంటర్ ఇన్‌చార్జి డీఏస్వీ వినాయక్ ప్రసాద్ మాట్లాడుతూ ఎస్‌పవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ త్రో అంశంలో క్రీడల్లో మహిళలకు ప్రోత్సాహం అందించాలని సాయ్ ఆదేశాల మేరకు వయస్సు వారీగా పోటీలు చేపట్టామన్నారు. ప్రతిభ చాటిన వారికి పతకాలతో పాటు బహుమతులు అందించామన్నారు. శిక్షకులు ఉదయ్‌సందీప్, శ్రీనివాస్,సీతాభవాని పాల్గొన్నారు.

విజేతలు వీరే

45 ఏళ్ల వయస్సులోపు విభాగంలో షాట్‌పుట్‌త్రో అంశంలో టి.మేరీమాణిక్యం, కె.అరుణ, కె సూర్యకుమారి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. కిలో మీటర్ పరుగుపందెంలో ప్రథమస్థానంలో రామసత్యవతి, ద్వితీయ స్థానంలో కె.శోభారాణి, తృతీయస్థానంలో బిందు నిలిచారు. వెయిట్‌లిఫ్టింగ్ డెడ్‌లిఫ్ట్ అంశంలో టి.మేరీమాణిక్యం, కె.అరుణ, టి.బాలప్రసన్న వరుస స్థానంలో విజయం సాధించారు. వీరితో పాటు ఎ.మౌనిక, పి.గౌతమి, వి.సాయిలక్ష్మీ సత్తా చాటారు.
45 ఏళ్ల వయస్సు పైబడిన వారిలో షాట్‌పుట్ త్రోలో ఎంఎస్ బిందు, ఎస్.విజయ, రమా సత్యవతి విజయం సాధించగా, కిలోమీటర్ పరుగులో టి.బాలప్రసన్న, కె.అరుణ, టి.మేరీమాణిక్యం, డెడ్‌లిఫ్ట్ అంశంలో కె.శోభారాణి, కె.సూర్యకుమారి, ఎంఎస్ బిందు వరుస స్థానంలో విజయం సాధించి పతకాలు సొంతం చేసుకున్నారు.